డబ్బులు తీసుకుని కార్డుల పంపిణీ !

- కార్మికుల ఐడీ కార్డుకు రూ. 250 వసూలు చేసిన వైనం
- మొత్తం రూ.1.50 లక్షలు వసూలు చేశారని ఆరోపణలు

రాజేంద్రనగర్: కార్మికులకు ఉచితంగా ఇవ్వాల్సిన గుర్తింపుకార్డుల (ఐడీ కార్డు)ను ఓ అధికారి సిబ్బంది చేత డబ్బులు వసూలు చేసి అందించాడు. ప్రతి కార్మికుడి వద్ద నుంచి రూ.250లు తీసుకుని పాతకార్డే ఇవ్వడంతో వారు లబోదిబోమంటున్నారు. ఈ విషయం సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జైపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో 600కు పైగా మున్సిపల్ కార్మికులు రోజూ విధులు నిర్వహిస్తున్నారన్నారు.

- కార్మికులకు రెండేళ్ల క్రితం అప్పటి రాజేంద్రనగర్ డీఎం అండ్ హెచ్‌ఓ ఐడీకార్డులను మంజూరు చేసిందన్నారు.
- ప్రస్తుతం అప్పటి ఏఎంహెచ్‌ఓ డాక్టర్ పద్మ, కామారెడ్డి జిల్లా డీఎం అండ్ హెచ్‌ఓగా విధులు నిర్వహిస్తుందన్నారు. ఆమె సంతకంతో ఉన్న కార్డులను రాజేంద్రనగర్ సర్కిల్ పారిశుద్ధ్య విభాగం డీఈఈ సూపర్‌వైజర్లకు తెలిపి ప్రతి కార్మికుడి వద్ద నుంచి రూ.250లు తీసుకుని కార్డులను అందజేశాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- ఈ కార్డుల ద్వారా డీఈఈ మొత్తంగా రూ.1.50 లక్షలు వసూలు చేశారన్నారు. కార్మికులకు ఉచితంగా ఇవ్వాల్సిన ఐడీ కార్డులను రూ.250లకు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు.
- రెండేళ్ల క్రితం ఏఎంహెచ్‌ఓగా ఉన్న అధికారి సంతకంతో ఇప్పుడు ఎలా కార్డులను జారీ చేస్తారని ప్రశ్నించారు. అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసి ఉండొచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. కార్మికుల నుండి వసూలు చేసిన డబ్బును వెంటనే తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు.
- ఈ విషయాన్ని గ్రేటర్ కమిషనర్‌తో పాటు మేయర్, దక్షిణ మండలం జోనల్ కమిషనర్, రాజేంద్రనగర్ సర్కిల్ కమిషనర్‌లకు ఫిర్యాదు చేయనున్నట్లు వివరించారు. ప్రస్తుతం అధికారులంతా ఎన్నికల విధుల్లో ఉన్నారని, వారిని నేరుగా కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. కార్మికుల నుంచి వసూలు చేసిన డబ్బును తిరిగి ఇచ్చి సంబంధిత అధికారిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ కార్యదర్శి రామకృష్ణగౌడ్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును బుద్వేల్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. దీనిలో భాగంగా చట్టాలపై అవగాహన కల్పించారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని, బాలికలు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఉన్నత చదువులు చదివి సమాజంలో ఉన్నత పదవులను అధిరోహించాలని సూచించారు. ఫోక్సో చట్టంపైన అవగాహన కల్పించారు. బాలికలను ఎవరైనా ఇబ్బంది పెడితే తల్లిదండ్రులు, పోలీసులకు వెంటనే తెలియజేయాలన్నారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి రామకృష్ణగౌడ్, ప్రధానోపాధ్యాయులు ఝాన్సీరాణి, లీగల్ హెడ్ సభ్యులు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులు, రాజేంద్రనగర్ ఎస్సైలు భానుప్రకాశ్, మౌనిక, కోర్టు సిబ్బంది నరేష్‌గౌడ్, యాదగిరి, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి చేరికలు



బీఆర్ఎస్‌లో చేరిన నార్సింగి కౌన్సిలర్ ఉషారాణి

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీకి చెందిన 17వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ ఉషారాణి తన అనుచరులతో కలిసి గురువారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ పార్టీ సమన్వయకర్త, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ వెంకటేష్‌యాదవ్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆర్. నర్సింహ ఆధ్వర్యంలో ఆమె ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నార్సింగి మున్సిపాలిటీలో నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడే కౌన్సిలర్ ఉషారాణి బీఆర్ఎస్‌లో చేరడం పార్టీకి మరింత బలాన్ని ఇస్తుందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఈసారి అత్యధిక మెజార్టీ వచ్చేందుకు నాయకులంతా కలసికట్టుగా కృషి చేయాలని ఆయన సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రేఖ యాదగిరి, కౌన్సిలర్లు పత్తి ప్రవీణ్‌కుమార్, శివారెడ్డి, అరుణజ్యోతి, నార్సింగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎం.ప్రవీణ్‌యాదవ్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, గోపాలగణేష్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డిలతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'చిత్రపురి' అధ్యక్షుడు సైతం..

మున్సిపాలిటీ పరిధిలోని చిత్రపురి కాలనీ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు, చిత్ర పరిశ్రమ ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గురువారం ఆయన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఆధ్వర్యంలో 300 మంది అనుచరులతో కలిసి పార్టీలో చేరగా.. ఆయన భార్య హైమాంజలి మణికొండ మున్సిపాలిటీ 1వ వార్డు కౌన్సిలర్‌గా బీజేపీ నుంచి గెలుపొందారు. త్వరలో మణికొండలో జరిగే మంత్రి హరీష్‌రావు బహిరంగసభలో ఆమె సైతం బీఆర్ఎస్ పార్టీలో చేరే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ గెలుపును ఆపే శక్తి ఏ పార్టీకీ లేదని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ సమన్వయకర్త, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు వసంతరావు, నవీన్‌కుమార్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శ్రీరాములు తదితరులున్నారు.

రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగికి భూ దళారీ బెదిరింపులు !



ఫిర్యాదు పత్రాన్ని చూపిస్తున్న రిటైర్డ్ ఉద్యోగి యాదగిరిరెడ్డి

సైబరాబాద్ కమిషనర్‌కు బాధితుడి ఫిర్యాదు

శంషాబాద్: పదవీ విరమణ పొందిన ఓ ప్రభుత్వ ఉద్యోగిని రియల్టర్ దళారి ఎస్సీ, ఎస్టీ కేసు పెడతానంటూ బెదిరిస్తున్న తీరుపై సదరు ఉద్యోగి సైబరాబాద్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. సదరు వృద్ధుడు గురువారం మీడియాకు వివరాలు వెల్లడించారు. సైదాబాద్‌లో స్థిరపడ్డ శంషాబాద్ నివాసి ఐయినాల యాదగిరిరెడ్డి భూమిని కొనుగోలు చేస్తానంటూ.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రూ. 3 లక్షలు ఇచ్చాడు. నిర్ణిత సమయంలో కొనుగోలు చేయలేని అతడు ఆ డబ్బును తిరిగి తీసుకున్నాడు. ఈ క్రమంలో మరో వ్యక్తి అకౌంట్ ద్వారా బ్యాంకు బంగారం తాకట్టు పెట్టి వాటిని కూడా తీసుకున్నాడు. డబ్బులు తిరిగి తీసుకున్న సంబంధిత వ్యక్తి వృద్ధుడికి సంబంధించిన భూముల్లో తనకు వాటా ఉందని బెదిరిస్తున్నాడని, సిద్ధాంతి హరిజనులతో ఎస్సీ.ఎస్టీ కేసు పెట్టిస్తానంటున్నాడని బాధితుడు వాపోయాడు. తాను ఇచ్చిన ఫిర్యాదుపై సమగ్ర విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరాడు. అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి అండదండలతోనే అతడు తనను ఇబ్బంది పెడుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

వైభవంగా శ్రీవారి పుష్పక వాహన సేవ

హఫీజ్‌పేట్: చందానగర్‌లోని విశాఖ శ్రీ శారదా పీఠపాలిత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం శ్రీవారి పుష్పక వాహన సేవ నిర్వహించారు. ఉదయం 7.30 గంటలకు ఉత్సవాస్తస్నపనం, విశేషపూజ, మధ్యాహ్నం 12.00 గంటలకు హారతీ తీర్థ ప్రసాదాలు అందించారు.





శ్రీవారి గరుడ వాహన, సహస్ర దీపాలంకార సేవలో పాల్గొన్న భక్తులు

ప్రధాన పార్టీల అభ్యర్థుల నామినేషన్ల దాఖలు



నామినేషన్ దాఖలు చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి ప్రకాశ్‌గౌడ్



కేంద్రమంత్రితో కలిసి నామినేషన్ వేస్తున్న తోకల శ్రీనివాస్‌రెడ్డి

అత్తాపూర్: రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ బీఆర్ఎస్ పార్టీ నుండి తన నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి మల్లయ్యకు అందజేశారు. ఆయనతో పాటు రవీందర్ రెడ్డి, రాజేంద్రనగర్ కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

భారీ ర్యాలీతో బీజేపీ అభ్యర్థి నామినేషన్ ..

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి గురువారం నియోజకవర్గంలో 50వేల మంది కార్యకర్తలతో భారీ ర్యాలీతో కేంద్రమంత్రి దేవ్‌సింగ్ చౌహాన్‌తో కలిసి ఎన్నికల అధికారికి నామినేషన్ సమర్పించారు.

మైలార్‌దేవ్‌పల్లి: నియోజకవర్గంలో 50వేల మెజారిటీతో గెలిచి బీజేపీ జెండా ఎగురువేస్తానని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ హనుమాన్ దేవాలయంలో ఉదయం నామినేషన్ పత్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భారీర్యాలీగా తరలివెళ్లారు. నియోజకవర్గం అభివృద్ధి సాధించాలంటే బీజేపికి ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. తోకల శ్రీనివాస్‌రెడ్డి తండ్రి తోకల శ్రీశైలం రెడ్డితోపాటు రాజేంద్రనగర్ నియోజవర్గం నుంచి ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సామాన్య ప్రజలకు అందుబాటులో వైద్యం

అత్తాపూర్: నూతన సాంకేతిక పరిజ్ఞానంతో వచ్చిన పరికరాలతో సామన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిన ఎంఅండ్ఎం ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మధురెడ్డి అభినందించాల్సిన అవసరముందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. సామాన్య ప్రజలకు అధునాతన వైద్యంతో కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా తక్కువ ధరలకే ఎంఅండ్ఎం ఆర్థో ఆసుపత్రి కృషి చేస్తుందన్నారు. గోల్డ్ మెడలిస్ట్ డాక్టర్ మధురెడ్డిని ఆయన అభినందించారు. డాక్టర్ మౌనిక, స్థానిక నాయకులు సురేశ్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, విజయ్, సోమ శ్రీనివాస్‌గుప్తా తదితరులున్నారు.

లారీని ఢీకొట్టిన డీసీఎం.. డ్రైవర్ మృతి

రాజేంద్రనగర్: ముందు వెళ్తున్న లారీని ఓ డీసీఎం వేగంగా వచ్చి ఢీకొట్టడంతో డీసీఎం డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్ర బీజాపూర్ ప్రాంతానికి చెందిన స్వామి (43) డీసీఎం డ్రైవర్. గురువారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో స్వామి తన డీసీఎం వాహనంతో గచ్చిబౌలి నుంచి శంషాబాద్ వైపు ఓఆర్ఆర్‌పై నుంచి వెళ్తున్నాడు. ఈ క్రమంలో హిమాయత్‌సాగర్ వద్దకు రాగానే ముందు వెళుతున్న లారీని వేగంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో స్వామి అక్కడికక్కడే మృతి చెందాడు. స్వామి మృతదేహం క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో ట్రాఫిక్ పోలీసులు అతి కష్టం మీద క్రేన్ సాయంతో బయటికి తీశారు. నిద్రమత్తులో ఢీకొట్టి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి

మైలార్‌దేవ్‌పల్లి: ఓ గుర్తు తెలియని మహిళ మృతి చెందిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాటేదాన్ గణేష్‌నగర్ ప్రాంతంలో గురువారం ఓ గుడిసెలో గుర్తు తెలియని మహిళ (40) మృతదేహం ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని చుట్టుప్రక్కల వారిని విచారించిన సరైన సమాచారం తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చందానగర్‌లో రూ.11,91,828 సీజ్

హఫీజ్‌పేట్ : చందానగర్ ప్రధాన రోడ్డులో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వద్ద వాహనంలో తరలిస్తున్న రూ.10,60,528 లను పోలీసులు పట్టుకున్నారు. మాణికేశ్వరి నగర్, ఉస్మానియా యూనివర్సిటి క్యాంపస్‌కి చెందిన ఈ.కృష్ణ ,అలాగే మొఘల్‌పురాకు చెందిన మహ్మద్ ముజాఫర్ రూ.1 ,31,300 లకు సరైన పత్రాలు చూపకపోవడంతో ఎస్ఓటీ, చందానగర్ పోలీసులు సీజ్ చేశారు.

ఆశావర్కర్ల సేవలు వెలకట్టలేనివి

గోల్కొండ: ఆశావర్కర్ల సేవలు వెలకట్టలేనివని హైదరాబాద్ జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.శ్రీనివాస్ అన్నారు. గురువారం గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో ఆయన ఆధ్వర్యంలో ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, పీహెచ్‌సీ వైద్యుల పనితీరుపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేషెంట్లకు వారి ఇంటి వద్ద కౌన్సెలింగ్ నిర్వహించి వారిని ప్రభుత్వ ఆస్పత్రుల వద్దకు తీసుకురావడంలో ఆశావర్కర్లు ఎంతో ఓపికతో పని చేస్తున్నారన్నారు. ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, వైద్యులు రోగులకు అవసరమైన సేవలు అందించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ జోన్ ఎస్పీహెచ్‌ఈఓ డాక్టర్ హర్ష యాదవ్, గోల్కొండ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్‌ఉల్లా, వైద్య అధికారులు పాల్గొన్నారు.

సీబీఐటీలో ఏసీఎం చాప్టర్ ప్రారంభం



మణికొండ: సీబీఐటీ కళాశాలలో అసోసియేషన్ ఆఫ్ కంప్యూటర్ మిషనరీ చాప్టర్‌ను గురువారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డెక్కన్ ఏసీఎం చైర్మన్ డాక్టర్ సీఎస్ ప్రభు మాట్లాడుతూ.. తమ సంస్థ 1947లో ప్రారంభమైందని, ఇది ప్రపంచంలోనే అతిపెద్ద శాస్త్రీయ, విద్యా కంప్యూటింగ్ సొసైటీ అన్నారు. వైస్ చైర్మన్ డాక్టర్ మునిరాజు నాయుడు, ప్రిన్సిపల్ సీవీ నరసింహులు, ఏఐఎంఎల్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్. మదనమోహన్, సీనియర్ ప్రొఫెసర్ రమాదేవిలతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోటమైసమ్మ దేవాలయం పునర్నిర్మాణ పనులు



పునర్నిర్మాణ పూజలో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: బుద్వేల్‌లోని చారిత్రాత్మక కోట మైసమ్మ దేవాలయం పునర్నిర్మాణ పనులు గురువారం ఉదయం ప్రారంభమయ్యాయి. రాజు శర్మ పంతులు ఆధ్వర్యంలో వేద పండితులు మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పనులను ప్రారంభించారు. మజ్జిగ అశోక్‌యాదవ్ దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. బుద్వేల్ గ్రామపెద్దలు, స్థానికులంతా కలిసి ఈ దేవాలయ పునర్నిర్మాణానికి పూనుకున్నారు. దేవదాస్‌గౌడ్, నర్సింహగౌడ్, వినయ్, సత్యనారాయణ, హరిచరణ్, పెంద్యాల శ్రీధర్, శ్రీను, జనార్దన్ తదితరులున్నారు.

'బీజేపీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధం'

అత్తాపూర్: ప్రధాని నరేంద్ర మోదీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై తెలంగాణ రాష్ట్ర ప్రజలు బీజేపీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మలి విడత నామినేషన్ ప్రక్రియలో భాగంగా గురువారం గుజరాత్ రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రి దేవిసింగ్ చౌహాన్ ఆధ్వర్యంలో డాక్టర్ ప్రేమ్‌రాజ్ పర్యవేక్షణలో అత్తాపూర్ ఆర్డీఓ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి మల్లయ్యకు నామినేషన్ పత్రాలను అందజేశారు. అనంతరం కేంద్రమంత్రి సమక్షంలో ఆయన మాట్లాడుతూ.. కరోనా కష్టకాలంలో దేశ ప్రజలకు కరోనా వ్యాధుల నుంచి విముక్తి చేసేందుకు కోట్లాది రూపాయలు ఖర్చు చేసిన నరేంద్ర మోదీ ఇతర దేశాలకు సైతం మన హైదరాబాద్‌లో చేసిన వ్యాక్సిన్‌ను పంపించిన ఘనత భారత్‌కు దక్కిందన్నారు. బీజేపీ సీనియర్ నాయకులు నారగూడెం మల్లారెడ్డి, మోంద్రా కొమురయ్య, నవారు మురళీధర్‌రెడ్డి, జనార్దన్, మల్లేష్‌యాదవ్, శ్రీశైలంరెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులున్నారు.

చిత్రపురి ధ్యానమందిరానికి భూమిపూజ



పూజల్లో పాల్గొన్న నాయకులు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని చిత్రపురి కాలనీలో ధ్యాన మందిర నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చిత్రపురి హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్, కౌన్సిలర్ హైమాంజలిలు మాట్లాడుతూ.. చిత్రపురిలో నివసిస్తున్న వారందరికీ అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను కల్పించేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామన్నారు. స్థానిక సత్సంగ సమాజం ధ్యాన మందిరం నిర్మాణం చేయాలని కోరడంతో వారి కోరిక మేరకు పనులను ప్రారంభించామన్నారు. త్వరలోనే పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. సత్సంగ సమాజం నిర్వాహకులు వాజపేయితో పాటు స్థానికులు పాల్గొన్నారు.

ఎన్ఈపీ దేశ అభివృద్ధిని నిర్ధారిస్తుంది

కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి డా.సుభాష్ సర్కార్

రాయదుర్గం: జాతీయ విద్యావిధానం దేశ అభివృద్ధిని నిర్ధారిస్తుందని కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి డాక్టర్ సుభాష్ సర్కార్ పేర్కొన్నారు. మనూలో టీచింగ్ స్టాఫ్, నాన్‌టీచింగ్ స్టాఫ్‌తో ఆయన గురువారం రాత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉర్దూ విశ్వవిద్యాలయం నూతన విద్యావిధానం -2020 (ఎన్ఈపీ-2020)ని అమలు చేసిన తీరు అభినందనీయమన్నారు. నూతన జాతీయ విద్యావిధానం రాబోయే పదేళ్లలో దేశ విద్యారంగాన్ని పూర్తిగా మార్చివేస్తుందన్నారు. విద్యార్థులు సులభంగా విద్యనభ్యసించడంతోపాటు నైపుణ్యం కలిగిన వారిని తీర్చిదిద్దడం ద్వారా ఉపాధి పొందడం సులువు అవుతుందన్నారు.

ఐసీఏఐతో బద్రుకా కాలేజ్ ఒప్పందం

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని ఐసీఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో గురువారం ప్రత్యేక ఒప్పంద కార్యక్రమాన్ని నిర్వహించారు. ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ), బద్రుకా కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ ఆర్ట్స్ హైదరాబాద్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. విద్యాసంబంధాలను పటిష్టం చేసుకోవడం, సహకారాన్ని పెంపొందించడానికిఈ ఒప్పంద కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల చైర్మన్ లక్ష్మీనివాస్ శర్మ, కళాశాల గౌరవ కార్యదర్శి కిషన్ ,ముప్పాల శ్రీధర్, సీఏలు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్

మణికొండ: రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న మణికొండ మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్‌ముదిరాజ్ శుక్రవారం నామినేషన్ వేస్తున్నారని మణికొండ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జితేందర్ తెలిపారు. ఉదయం 8గంటలకు పుప్పాలగూడ కాశీవిశ్వేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ర్యాలీగా నార్సింగి, మంచిరేవుల, అప్పా, కాళీమందిర్, బండ్లగూడ చౌరస్తా, కిస్మత్‌పూర్ గ్రామం, బుద్వేల్, డెయిరీఫామ్‌ల ద్వారా ఉదయం 11.15 గంటలకు ఆర్డీఓ కార్యాలయం చేరుకుని నామినేషన్ వేస్తారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

బండ్లగూడ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళ్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ గెలుపు ఖాయమని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా గురువారం కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్ 9వ డివిజన్‌లోని పలు కాలనీలు, బస్తీలలో ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్‌కు ఓటువేసి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీకే ప్రజల పూర్తి మద్దతు ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాలు మరోసారి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ఉపయోగపడతాయన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతున్న ఎమ్మెల్యేను గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాందాస్ ముదిరాజ్, బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు గోకరి సురేష్‌గౌడ్, కార్పొరేటర్లు నిఖిల సంగారెడ్డి, సంతోషిరాజిరెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, సాగర్‌గౌడ్, నాయకులు వెంకట్‌రెడ్డి, పాపయ్యయాదవ్, గోపాల్‌ముదిరాజ్, విష్ణువర్ధన్‌రెడ్డి, పాండు, సయ్యద్‌ఖాజా, రజాక్, రాజు, మల్లేష్‌యాదవ్, నర్సింగ్‌రావు, సాదిక్, సదానంద్ తదితరులున్నారు.

కాంగ్రెస్‌లోకి నర్ఖూడ ఎంపీటీసీ

శంషాబాద్ రూరల్: మండలంలోని నర్ఖూడ ఎంపీటీసీ తొంట గౌతమి అశోక్ తిరిగి సొంత గూటికి చేరుకున్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కె.నరేందర్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి తొండుపల్లిలో నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరి సభ సందర్భంగా ఆమె కాంగ్రెస్‌లో చేరారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

12 మంది నామినేషన్లు దాఖలు

అత్తాపూర్: నియోజకవర్గంలో గురువారం మొత్తం 12 మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు రాజేంద్రనగర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మల్లయ్య తెలిపారు. బీజేపీ రాజేంద్రనగర్ అభ్యర్థిగా తోకల శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకాష్‌గౌడ్‌లతో పాటు స్వతంత్ర అభ్యర్థులుగా వడ్డెల మల్లేష్, మహ్మద్ అఖిల్, గుర్రంపల్లి కీర్తి, నల్లగొప్పుల హరీష్, అబ్దుల్ అజీజ్, పొంగునూరి భవానీ, అశ్వినిరెడ్డి, ఆనంద్‌రెడ్డిలు తమ నామినేషన్లు దాఖలు చేసినట్లు వివరించారు.

అభివృద్ధిని కోరుకుంటున్న ప్రజలు

బండ్లగూడ: ప్రజలు మార్పును కోరుకుంటున్నారని అందుకే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కడతారని బండ్లగూడ మాజీ సర్పంచ్ హరికృష్ణ వెల్లడించారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ సర్పంచ్ హరికృష్ణ పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి సమక్షంలో గురువారం కాంగ్రెస్‌పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాభివృద్ధికి పాటుపడుతున్న కాంగ్రెస్‌కే ప్రజల మద్దతు ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో చేతి గుర్తు అధికారంలోకి రావడం ఖాయమన్నారు. నియోజకవర్గం కస్తూరి నరేందర్ విజయం కోసం పాటుపడతామన్నారు. అందరినీ కలుపుకుంటూ ప్రజల్లోకి వెళ్తామన్నారు. జైపాల్‌రెడ్డి, మైకేల్‌రెడ్డి, డప్పు నవీన్, శేఖర్, నగేష్, గంగని రాజు, అమూల్‌రాజు తదితరులున్నారు.

లక్ష మెజారిటీతో గెలిపిస్తాం..

రాజేంద్రనగర్: ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను లక్ష మెజార్టీతో గెలిపిస్తామని రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్ అన్నారు. గురువారం డివిజన్ అధ్యక్షులు పోరెడ్డి ధర్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి పలుగుచెరువు మహేశ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ... ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి కార్యక్రమాలే ఆయనను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు ప్రొఫెసర్ రవీందర్, రగడంపల్లి శ్రావణ్, ప్రభాకర్‌రెడ్డి తదితరులున్నారు.

అత్తాపూర్‌లో బీఆర్ఎస్ ప్రచారం

అత్తాపూర్: అత్తాపూర్ భాగ్యనగర్ కాలనీలో గురువారం పెద్దఎత్తున ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కారు గుర్తుకు ఓటువేసి ప్రకాష్‌గౌడ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ నాయకులు మిద్దెల బ్రదర్స్ సురేందర్ రెడ్డి, సురేష్‌రెడ్డి, మధు, సత్తిరెడ్డి, పీఎం రెడ్డి, ముఖేష్, అప్పారెడ్డి, గౌరీశంకర్, మల్లేష్‌యాదవ్, శేఖర్, అర్జున్‌రెడ్డి, మహేష్, శివారెడ్డి, నరేందర్, కృష్ణ, రవి తదితరులున్నారు.

ఆరో రోజు.. ఏడు నామినేషన్లు

- బీ ఫారంతో నామినేషన్ వేసిన కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్ గౌడ్
- 25కు చేరిన నామినేషన్ల సంఖ్య

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఆరో రోజు ఏడుగురు నామినేషన్లు వేశారు. మొత్తం నామినేషన్ల సంఖ్య 25కు చేరింది. కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్ ర్యాలీగా వచ్చి బీ ఫారంతో నామినేషన్ వేశారు. బీఎస్పీ అభ్యర్థిగా ఒంగోరు శ్రీనివాస్ యాదవ్, ప్రజా వెలుగు పార్టీకి చెందిన నక్కా ప్రభాకర్ , రాష్ట్రీయ జన మోర్చ పార్టీకి చెందిన షేక్ సైఫ్, స్వతంత్ర అభ్యర్థులుగా గుండ్ల కార్తీక్, శ్రీనివాస్‌రావు జాదవ్, కె.పృథ్వీపతిరావు, పి.మాధవిలతలు నామినేషన్ పత్రాలను ఆర్ఓ శ్రీనివాస్‌రెడ్డికి అందజేశారు. నేడు ఏడుగురు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారని, నామినేషన్ల సంఖ్య 25కు చేరిందని ఆర్ఓ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థి పూజలు.. ర్యాలీలు

గచ్చిబౌలి: కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్ నామినేషన్ ర్యాలీ అట్టహాసంగా సాగింది. గురువారం రెండోసారి ఆయన నామినేషన్ దాఖలు చేశారు. నల్లగండ్లలోని మల్లన్న స్వామి దేవాలయంలో పూజలు చేసి అక్కడి నుంచి ఉదయం 8 గంటలకు హైదర్‌నగర్‌లోని మైసమ్మ ఆలయం, హైదర్‌నగర్ దర్గాలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ర్యాలీగా బొల్లారం చౌరస్తా, ఆల్విన్ కాలనీ జంక్షన్ నుంచి గంగారం వరకు సాగింది. గంగారంలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. చందానగర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అక్కడి నుంచి తారానగర్‌లో తుల్జా భవాని ఆలయంలో పూజలు చేశారు. అక్కడి నుంచి ర్యాలీగా శేరిలింగంపల్లి రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లారు.

తారానగర్‌లో ఘన స్వాగతం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి తారానగర్‌లో జగదీశ్వర్‌గౌడ్‌కు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు తారానగర్‌లో జగదీశ్వర్‌గౌడ్‌కు గజమాల వేయడంతో పాటు పూల వర్షం కురిపించారు.